క్లుప్తంగా

'మెఫీ' సేవలు అభినందనీయం



పద్మను సత్కరిస్తున్న సీఐ రాజిరెడ్డి, సంస్థ బాధ్యులు

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలో గల మెఫీ మానసిక దివ్యాంగుల కేంద్రం పిల్లలకు చేస్తున్న సేవలు అభినందనీయమని రూరల్ సీఐ రాజిరెడ్డి అన్నారు. గురువారం కేంద్రం నిర్వహణ కోసం షేర్ ది విజన్ స్వచ్ఛంద సంస్థ బాధ్యులు రూ.5లక్షల విలువైన వివిధ రకాల సామగ్రిని సీఐ చేతుల మీదుగా అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈమేరకు విరాళం అందించిన సంస్థకు కేంద్రం నిర్వాహకురాలు పద్మ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పద్మను సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు నారాయణ, పాల్, గుణరావు, వీరబాబు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి తుమ్మలను కలిసిన నాయకులు

ఖమ్మంఅర్బన్: మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును గురువారం హైదరాబాద్‌లో ఆయన అనుచరులు పలువురు కలిశారు. ఈ సందర్భంగా ఖాదర్‌బాబా, మంజర్లపాటి హన్మంతరెడ్డి, జలగం రామకృష్ణ, కందగట్ల రాజేందర్, దారపునేని చెన్నయ్య, సిరాజ్, అఫ్రోజ్‌ఖాన్ తదితరులు ఆయనను కలవగా, కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో తుమ్మల నాయకత్వాన ఖమ్మం జిల్లా సమగ్ర అభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నియామకం



కరుణాకర్(ఫైల్)

ఖమ్మంరూరల్: మండలంలోని గోళ్లపాడు గ్రామంలో గురువారం రూరల్ మండల కల్లు గీత కార్మికుల సహకార సంఘం ఎన్నిక నిర్వహించారు. సంఘం మండల అధ్యక్షుడిగా గోళ్లపాడుకు చెందిన కొండం కరుణాకర్‌గౌడ్‌ను ఎన్నికల అధికారి రాంరెడ్డి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ.. కల్లుగీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.ఈమేరకుకరుణాకర్‌ను ఆలుదాసు ఆంజనేయులుతో పాటు పలువురు అభినందించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి బి.సంగయ్య, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న రాకేశ్

నేలకొండపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉపాధి కల్పించడంలో విఫలమయ్యాయని పీవైఎల్ జిల్లా కార్యదర్శి ఎన్.వీ.రాకేశ్ ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకులు అనుసరిస్తున్న తప్పుడు విధానాలపై యువజనులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పీవైఎల్ జిల్లా మహాసభల సందర్భంగా ఆహ్వాన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్లయ్య, మోహన్‌రెడ్డి, ప్రజాపంథా పాలేరు డివిజన్ కార్యదర్శి వెంకయ్య, శివలింగం, పగిడికత్తుల రామదాసు, ఝాన్సీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నివాళి..

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాటయోధుడు పప్పుల భద్రయ్య ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి శ్రీను గురువారం భద్రయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించాక ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు తుళ్లూరి నాగేశ్వర రావు, బింగి రమేశ్, సురేశ్, పద్మనాభుల సుధాకర్, నిర్మల్‌రావు, చల్ల వెంకటేశ్వర్లు, రామన బోయిన రవి, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	మార్క్ ఆంటోని
వినోద	ది నన్
సాయిరాం	మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి
ఆదిత్య	7జీ బృందావన కాలనీ
శ్రీనివాస	జవాన్

- ఖమ్మంగాంధీచౌక్

సామూహిక పూజలు, అన్నదానాలు

గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండపాల్లో కొలువుదీరిన వినాయకుడికి సామూహిక పూజలు గురువారం ముమ్మరంగా కొనసాగాయి. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం గణేశ్ మండపాల వద్ద ఉత్సవ కమిటీల ఆధ్వర్యాన అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళ మండపాల వద్ద సాంస్కృతిక ప్రదర్శలతో సందడి నెలకొంది.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంఅర్బన్: 14వ డివిజన్ మధురానగర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అజయ్



ఖమ్మంరూరల్: నాయుడుపేటలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి



16వ డివిజన్ అగ్రహారంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు



అగ్రహారం గేటు వద్ద అన్నదానం చేస్తున్న శ్రీ లక్ష్మీగణపతి ఉత్సవ కమిటీ సభ్యులు



ఖమ్మంఅర్బన్: 11వ డివిజన్ కవిరాజ్‌నగర్‌లోని ఐశ్వర్య టవర్స్‌లో సహస్ర దీపాలంకరణ



ఖమ్మంగాంధీచౌక్: యూపీహెచ్ కాలనీలో స్తంభాద్రి ఉత్సవ సమితి ప్రతినిధుల పూజలు



విజయనగర కాలనీ-2లోని షిరిడీ సాయిబాబా మందిరంలో అన్నదాన కార్యక్రమం



ఖమ్మం మామిళ్లగూడెం: శుక్రవారపుపేటలో పూజలు చేస్తున్న భక్తులు

సౌండ్ సిస్టం బహూకరణ..

కూసుమంచి: మండలంలోని ఈశ్వరమాధారంలో శ్రీ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన వినాయకుడికి రూ.40వేల విలువైన సౌండ్ సిస్టంను గురువారం ఎంపీటీసీ మోదుగు వీరభద్రం అందజేశారు.ఎమ్మెల్యేలు కందాళ, సండ్ర గెలుపును కాంక్షిస్తూ వితరణ చేసినట్లు తెలిపారు.

సెల్ఫీ విత్ వినాయకా..



ద్వారకానగర్‌లో మురళీమోహన్



బ్రాహ్మణబజార్‌లో డాలే సాయికిరణ్ దంపతులు



చందమామ అపార్ట్‌మెంట్‌లో భారతీశ్రీనివాస్



వైఎస్సార్‌నగర్‌లో చిన్నారి



మోతీనగర్‌లో ఆమంచి సురేష్‌శర్మ



జీకే బజార్‌లో నైనకంటి హరికృష్ణ శర్మ

కొత్త పంచాయతీ.. కొండంత అభివృద్ధి

ప్రారంభానికి సిద్ధమైన జీపీ భవనం

రఘునాథపాలెం: నాలుగేళ్ల క్రితం గిరిజన తండాలను ప్రభుత్వం గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యాన రఘునాథపాలెం మండలంలో 24 గ్రామపంచాయతీలు ఉండగా, వీటి సంఖ్య 37కు చేరింది. ఇందులోభాగంగా వేపకుంట్ల పంచాయతీ నుండి విడిపోయి చెరువు కొమ్ముతండా నూతన పంచాయతీగా ఏర్పడగా అద్దెభవనంలో కార్యకలాపాలు ప్రారంభించారు. గడిచిన నాలుగేళ్లలో అనేక అభివృద్ధి పనులు చేపట్టడంతో ఈ పంచాయతీ ఆదర్శంగా నిలుస్తోంది. ఎస్టీ మహిళకు రిజర్వ్ అయిన స్థానం నుంచి సర్పంచ్‌గా బానోత్ మంగమ్మ గెలిచాక అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.10.50 లక్షలతో ట్రాక్టర్ కొనుగోలు చేయగా, ప్రధాన రహదారిని ఆర్‌అండ్‌బీ అధికారులు అభివృద్ధి చేస్తున్నారు. ఇంకా అంతర్గత రహదారులను రూ.75 లక్షలతో సీసీగా మార్చగా, రూ.30లక్షలతో డ్రెయిన్లు, రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ నిర్మించారు. మొత్తంగా రూ1.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. నిర్మాణం పూర్తయిన జీపీ భవనాన్ని శుక్రవారం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించనున్న సందర్భంగా సర్పంచ్ మంగమ్మ మాట్లాడుతూ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సహకారంతో అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తుండడం ఆనందంగా ఉందని తెలిపారు.



ప్రారంభానికి ముస్తాబైన జీపీ భవనం

డబుల్ ఓట్లు తొలగించాలి



మాట్లాడుతున్న కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: బూత్ లెవల్‌లో ఓటరు పరిశీలన పక్కాగా జరగాలని, డబుల్ ఓట్లు ఉన్న వాటిని, మరణించిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగించాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి సిబ్బందిని ఆదేశించారు. గురువారం కేఎంసీ సమావేశ మందిరంలో సెక్టార్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లతో కమిషనర్ నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాలో మరణించిన వారి పేర్లు గుర్తిస్తే.. వారి కుటుంబ సభ్యుల కోవాలని, డబుల్ ఓట్లు గుర్తిస్తే ఆ ఓటరుకు సమాచారం ఇచ్చి తన సమ్మతి మేరకు ఒక ప్రాంతంలో మాత్రమే ఓటు ఉండేలా చూడాలని పేర్కొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

కామేపల్లి: అంగన్‌వాడీల సంసమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 11వ రోజుకు చేరింది. కొత్తలింగాల క్రాస్ రోడ్డులో కామేపల్లి ప్రాజెక్టు పరిధిలోని కామేపల్లి, కారేపల్లి, ఏన్కూర్ మండలాలకు చెందిన అంగన్‌వాడీ ఉద్యోగులు నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. తమ సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆయాలు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు పాలకుర్తి నాగయ్య(100) గురువారం మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. నాగయ్య మృతదేహాన్ని సర్పంచ్ ఈవూరి సుజాత, సొసైటీ చైర్మన్ పగిడిపత్తి శ్రీనివాస్, మాజీ చైర్మన్ ఈవూరి శ్రీనివాసరెడ్డి, గ్రామ పెద్దలు సందర్శించి నివాళులర్పించారు.

క్రికెట్ పోటీలకు న్యాయమూర్తుల ఆహ్వానం

ఖమ్మంలీగల్: వచ్చే నెల 6, 7, 8 తేదీల్లో నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించే జిల్లా అడ్వకేట్స్ క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించి పలువురు న్యాయమూర్తులకు గురువారం ఆహ్వాన పత్రికలను నిర్వాహకులు అందించారు. జిల్లా ఫోర్ట్ పోలియో జడ్జి కె.లక్ష్మణ్, న్యాయమూర్తులు కాజా శరత్, భీమ్‌పాక నగేష్‌లకు ఈ ఆహ్వాన పత్రికలను అందజేశారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు, బలహీన వర్గాల స్ఫూర్తిదాత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా గురువారం ట్యాంక్‌బండ్ వద్ద గల కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమచారి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగబోయిన పుల్లారావు, సుగుణ, విజయకుమార్, రామాచారి, రవి, శ్రీను, బి.దను తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం పోరాడాలి

నేలకొండపల్లి: రైతు రుణమాఫీ కోసం క్షేత్రస్థాయిలో పోరు సాగించేందుకు సిద్ధం కావాలని సీపీఎం మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని చెన్నారం జోన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలా చోట్ల చాలా మంది రైతులకు రుణమాఫీ వర్తించలేదని, అందరికీ వర్తించేలా బ్యాంకుల వద్ద ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా బీసీ బంధు పథకాన్ని అర్హులందరికీ అందించాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డులో పిల్లల నమోదు కోసం అవకాశం కల్పించాలని కోరారు. మాజీ ఎంపీపీ రచ్చా నరసింహారావు, నాయకులు బెల్లం లక్ష్మి, అశోక్, నాగేశ్వరరావు, వీరు, రాసాల నవీన్, భూక్యా జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌లు..

కూసుమంచి: మండలంలోని కిష్టాపురం గ్రామంలో గురువారం టీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యాన దివ్యాంగులకు 50 శాతం రాయితీతో కూడిన బస్‌పాస్‌లను గ్రామ సర్పంచ్ పందిరి పద్మ చేతుల మీదుగా అందజేశారు.ఈనేపథ్యాన ఆర్టీసీ కల్పిస్తున్న రాయితీని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సూచించారు. ఆర్టీసీ ఉద్యోగులు రవీంద్రనాథ్, భుజంగర్‌తో పాటు గ్రామపెద్దలు సత్యనారాయణ రెడ్డి, కేశవరెడ్డి పాల్గొన్నారు.

'సీజనల్స్'పై అప్రమత్తంగా ఉండాలి

నేలకొండపల్లి: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రభుత్వ వైద్యాధికారి నిరోష సూచించారు. మండలంలోని కొత్తకొత్తూరు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ అభ్యర్థన మేరకు గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. బాధితులు స్థానిక వైద్య సిబ్బందిని సందర్శిస్తే.. వైద్య పరీక్షలు నిర్వహించి తగిన మందులను అందిస్తారని, పరిస్థితి తీవ్రంగా ఉంటే వెంటనే సీహెచ్‌సీ, పీహెచ్‌సీకి తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు పంచాయతీ కార్యదర్శి నాగేంద్రబాబు, ఏఎన్‌ఎం వెంకటరమణ, ఆశ కార్యకర్త అరుణ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యాధికారి నిరోష, సర్పంచ్ రాధాకృష్ణ

నలుదిశలా ఖమ్మం అభివృద్ధి..

అభివృద్ధి పనుల శంకుస్థాపనలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంఅర్బన్: ఖమ్మం కార్పొరేషన్ నలుదిశాల అభివృద్ధి చెందుతూ.. అభివృద్ధికి అడ్డాగా నిలుస్తుందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని గొల్లగూడెంలో రూ.85 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో విలీనం చేసి కార్పొరేషన్‌గా మార్చిన తర్వాత విలీన గ్రామాలన్ని అభివృద్ధి చేశామని, మురికి కూపంలా ఉన్న ఖమ్మం నగరాన్ని అభివృద్ధికి అడ్డాగా మార్చామని తెలిపారు. సరైన రోడ్లు, మురుగు వ్యవస్థ, తాగునీటి కొరత తదితర సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ఒక ప్రణాళిక, చిత్తశుద్ధితో సమస్యలకు పరిష్కార మార్గం చూపామని పేర్కొన్నారు. ముచ్చటగా మూడోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 30వ తేదీన ఖమ్మంకు మంత్రి కేటీఆర్ రానున్నారని, రూ.1,200 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, కార్పొరేటర్ కురాకుల వలరాజ్, దండా జ్యోతిరెడ్డి, మున్సిపల్ ఎంఈ కృష్ణలాల్, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, నాయకులు ఆర్జేసీ కృష్ణ, పగడాల నాగరాజు, దేవభక్తుని కిషోర్‌బాబు, కొల్లు పద్మ, తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని 14వ డివిజన్ మధురానగర్‌లోని శ్రీసద్గురుసాయి బాబా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపంలో మంత్రి అజయ్ కుమార్ పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్, మేయర్, సుడా చైర్మన్‌లతో పాటు ఆలయ బాధ్యులు శ్రీనివాసరావు, వల్లభనేని రామారావు తదితరులు పాల్గొన్నారు.



గొల్లగూడెంలో శంకుస్థాపన చేస్తున్న మంత్రి పువ్వాడ, పక్కన డీసీసీబీ చైర్మన్, తదితరులు

కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

కూసుమంచి: వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు ఎర్రా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం కూసుమంచిలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మికుల పట్ల బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయని, సమగ్ర చట్టం లేకపోవడంతో శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆరోపించారు. కార్మికులకు కూలీబంధు పథకాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు 200 రోజుల పని దినాలను పెంచాలని, రోజు కూలీ రూ.600 తగ్గకుండా చట్టం తీసుకరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శీలం గురుమూర్తి, మూడ్ గన్యా నాయక్, కర్ణబాబు, బాబు, హరిలాల్, కందుల బాబు, మధు తదితరులు పాల్గొన్నారు.

'బీసీలను అవమానపరిచేలా రిజర్వేషన్ బిల్లు'



మాట్లాడుతున్న నారాయణవరపు శ్రీనివాస్

ఖమ్మం మామిళ్లగూడెం: జనాబాలో 56 శాతం ఉన్న బీసీలకు కనీసం మహిళా బిల్లులో కూడా మహిళల వాటాగా ఓబీసీలకు అవకాశం కల్పించకపోవటం దారుణమని, ఇది బీసీ సమాజాన్ని అవమానపరచడమేనని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ అన్నారు. బుధవారం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నలమాస సుగుణ అధ్యక్షతన లకారం ట్యాంక్‌బండ వద్ద గల సంఘ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహిళా రిజర్వేషన్ బిల్లు ఇప్పటి వరకు దొరలకు మొక్కితే.. ఇక నుంచి దొరసానులకు మొక్కండని చెప్పకనే చెప్పినట్లు ఉందన్నారు. అంతేకాక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి, మహాత్మ జ్యోతిరావుపూలే ఐడీయాలజీ సొసైటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగబోయిన పుల్లారావు, అన్నారపు రామాచారి, యామా రవి, మరీదు శ్రీను, బలుసుపాటి దను తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన

కామేపల్లి: మండలవ్యాప్తంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం స్వయం సహాయ మహిళా, వీఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి స్వచ్ఛతా సమ్మేళనాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇంటి వద్దనే తడి, పొడి చెత్తాలను వేరు చేసే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం మహిళలతో కలిసి శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కరరెడ్డి, ఎంపీఓ సత్యనారాయణ, ఏపీఎం సురేందర్ బాబు, సర్పంచ్ జాటోత్ జాయ్‌లూసీ, కార్యదర్శి రవికుమార్, పెంద్ర అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న షేక్ బషీరుద్దీన్

తిరుమలాయపాలెం: మణిపూర్‌లో జరిగిన మరణకాండపై డీవైఎఫ్ఐ ఆధ్వర్యాన ఈ నెల 23, 24 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించే తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి షేక్.బషీరుద్దీన్ పిలుపునిచ్చారు. గురువారం తిరుమలాయపాలెం గజ్జల వెంకటయ్య భవనంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో తరగతులకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మొదటి రోజు ఉదయం 10 గంటలకు ఖమ్మం మంచికంటి భవనంలో మణిపూర్ మారణకాండ దేశ రాజకీయ ముఖచిత్రం అనే అంశంపై నిర్వహిస్తున్న సెమినార్‌లో ఎమ్మెల్సీ లక్ష్మణ్‌రావు పాల్గొని మాట్లాడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దిండు మంగపతి, మండల కార్యదర్శి మహేందర్, నాయకులు దోనెపల్లి వినయ్, వెంకటేశ్, సాయి, నాగరాజు, నరేశ్, వంశీ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మం రాపర్తినగర్: నగరంలోని ఎస్ఆర్‌అండ్‌బీ జీఎన్ఆర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌యూ కాలేజీ కమిటీ ఆధ్వర్యాన గురువారం కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నగర కార్యదర్శి కరుణ్ మాట్లాడుతూ.. సెమిస్టర్ విద్యా విధానంలో మొదటి, మూడో సెమిస్టర్‌లోని పరీక్షల ఫలితాలు ఇవ్వని పరిస్థితి కళాశాలలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. యూజీసీ నిబంధనల ప్రకారం యూనివర్సిటీలు, డిగ్రీ అటానమస్ కాలేజీలో డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో ఒక సబ్జెక్టు ఆగితే ఇన్స్టెంట్ ఎగ్జామ్ ద్వారా విద్యార్థులకు పరీక్ష నిర్వహించాల్సి ఉంటుందని చెప్పారు. కానీ ఈ కళాశాల అటానమస్ కావడంతో ఒక సబ్జెక్టు ఫెయిల్ అయినా.. ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఇన్స్టెంట్ ఎక్సమ్ పెట్టకుండా.. రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం సరికాదన్నారు.

రాజకీయ జోక్యం ఉండొద్దు

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం సొసైటీ పరిధిలో రైతాంగానికి కొత్త రుణాలు ఇచ్చే విషయంలో రాజకీయ జోక్యాన్ని నివారించాలని కోరుతూ గురువారం సొసైటీ సీఈఓ శ్రీనివాసరెడ్డికి సీపీఎం మండల కమిటీ సభ్యులు వినతి పత్రం సమర్పించారు. రాజకీయ వివక్ష కొనసాగితే జిల్లా అధికారులను కలవడంతో పాటు ఆందోళనలు ఉధృతం చేస్తామని కమిటీ సభ్యులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి శ్రీను, రైతు సంఘం మండల అధ్యక్షుడు తుల్లూరి నాగేశ్వరరావు, నాయకులు సురేష్, శ్రీనివాస్, కోటయ్య, వెంకన్న, రవి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'గడప గడపకూ కాంగ్రెస్'

ఖమ్మంరూరల్: పాలేరు నియోజకవర్గంలోని దారేడు, పడమటితండా, జాన్‌బాద్‌తండాల్లో గురువారం టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర చార్జ్ షీట్ కమిటీ సభ్యుడు మద్ది శ్రీనివాసరెడ్డి గురువారం రాత్రి ఇంటింటికి కాంగ్రెస్ గ్యారంటీ కార్డులు పంచుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోగా గ్యారంటీ కార్డులో ఉన్న సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొక్కా వీరారెడ్డి, బానోత్ సురేష్‌నాయక్, ఏనుగు కృష్ణారెడ్డి, మద్ది వీరారెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న ఆకతాయిలు...

నేలకొండపల్లి: కాలేజీకి రాకపోకల సమయాన ఆకతాయిలు బైక్ రైడింగ్‌లతో రెచ్చిపోతూ.. విద్యార్థినుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన కాలేజీ విద్యార్థులు సైతం ర్యాగింగ్‌కు పాల్పడుతున్నారు. దీంతో అధ్యాపకులే ఎస్కార్ట్‌గా విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ఘటన నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలకు వెళ్లే నేలకొండపల్లి-కూసుమంచి రహదారిలో నిత్యం చోటు చేసుకుంటున్నట్లు సమాచారం. ఈమేరకు కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.ఎన్.శాస్త్రి కాలేజీ ప్రారంభం, ముగింపు సమయాన పెట్రోలింగ్ చేపట్టాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. కాలేజీ ముగిసిన తరువాత కొంత మంది విద్యార్థులు జాతీయ రహదారి వంతెన కింద గుంపులుగా చేరి వచ్చి పోయే విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అందులో కాలేజీకి చెందిన ఓ ఇద్దరు విద్యార్థులకు పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ మారకపోవడంతో.. తాజాగా ఆ ఇద్దరిని టీసీ ఇచ్చి పంపించారు. కాగా, రోజుకు ఇద్దరు అధ్యాపకుల చొప్పున ఎస్కార్ట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా.. తాము స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, ప్రస్తుతం అధ్యాపకులనే ఎస్కార్ట్‌గా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.